క్లుప్తంగా

కేడీసీసీ డైరెక్టర్ పదవీ కాలం పొడిగింపు

ప్యాపిలి: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్‌గా హుసేనాపురం మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సీమ సుధాకర్ రెడ్డి పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించారు. రెండేళ్ల క్రితం డైరెక్టర్‌గా ఎంపికైన ఆయన పదవీ కాలం ఈ నెల 17 తో ముగిసింది. అయితే ఈయన పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ సహకార శాఖ నుంచి ఆదేశాలు అందాయి. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి సీమ సుధాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభల పోస్టర్ల విడుదల

బనగానపల్లెరూరల్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఏపీ గిరిజనసమాఖ్య రాష్ట్ర స్థాయి మహాసభల పోస్టర్లను బుధవారం స్థానిక కార్యాలయంలో నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాలింగి రాముడు మాట్లాడుతూ మహాసభలో గిరిజనుల హక్కుల సంరక్షణ, సమస్యలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సమాఖ్య నాయకులు కిశోర్, ఖాదర్, రఫీ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి కుట్టు మిషన్ విరాళం

ప్యాపిలి: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు దేవీ దయానంద్ సింగ్ కుట్టుమిషన్ విరాళంగా అందజేశారు. 18వ తేదీ తన తండ్రి భవాని సింగ్ వర్ధంతి సందర్భంగా కుట్టుమిషన్ ఇచ్చినట్లు దేవీ దయానంద్ సింగ్, బాలాజీ సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓ ప్రియాంక, శేగు హరి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

బనగానపల్లెరూరల్: విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన పట్టుదలతో చదవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం అధ్యాపకులు డాక్టర్ కె.రామకృష్ణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత దేవి ఆధ్వర్యంలో బుధవారం ఫేర్‌వేల్ కార్యక్రమంల జరిగింది. ఆ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ఎంతో కష్టపడి వారి సంపాదనతో చదివిస్తుం టారని, విలువైన సమయాన్ని విద్యార్థులు వృథా చేయకుండా వారి ఆశలను నేరవేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, కోటేశ్వరరావు, కౌసల్య, వరలక్ష్మీ, వహిదా, నాగరాజు, సయ్యద్‌లు విద్యార్థులకు సూచనలను చేశారు.

సూపర్ మార్కెట్ తనిఖీ



బియ్యం ప్యాకెట్ తూకాన్ని తనిఖీ ఖాజా హుసేన్

బేతంచెర్ల: స్థానిక గాయత్రీ సూపర్ మార్కెట్, కిరాణా దుకాణాలను బుధవారం డోన్ లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుసేన్ తనిఖీ చేశారు. గాయత్రి సూపర్ మార్కెట్‌లో 26 కేజీల బియ్యం ప్యాకెట్‌లో 25 కేజీలు ఉండటంతో రూ. 25 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ధ్యాన ప్రియ కిరణా షాపులో 25 కేజీల బియ్యం ప్యాకెట్‌లో 23 కేజీలు, భాగ్యలక్ష్మి కిరాణా షాపులో 50 కేజీల బియ్యం ప్యాకెట్‌లోనూ 7 కేజీలు తేడా ఉండడంతో ఒక్కో షాపుకు రూ. 25 చొప్పున జరిమానా విధించామని ఆయన తెలపారు. క్వాలిటీ తగ్గినా, అధిక ధరలకు విక్రయించినా, తూకాలల్లో మోసాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని దుకాణాల యాజమాన్యాలను ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలి

బేతంచెర్ల: పండ్ల తోటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏపీఓ శేషన్న సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఏపీఓ మాట్లాడారు. మండలంలో ఈఏడాది మామిడి, చీని తోటల సాగుకు సంబంధించి 190 ఎకరాల్లో 83 మంది రైతులకు అనుమతి వచ్చిందన్నారు. అలాగే రహదారులకు ఇరువైపులా 16 కిలోమీటర్ల మొక్కలు నాటేందుకు అనుమతి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. 100 మొక్కల పర్యవేక్షణకు ఒక పాదుపు మహిళను ఏర్పాటు చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు సూచించారు.

సన్మానం

బనగానపల్లెరూరల్: మండలంలోని కైప ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన లక్ష్మణ్‌తోపాటు ఉపాధ్యాయుడు శ్రీనివాసులను హెచ్‌ఎం సన్నన్న ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. వారికి ఎంఈఓ స్వరూప, సర్పంచ్ కె.లక్ష్మమ్మ, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రభాకర్ తదితరులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు.

విద్యార్థినులకు అవగాహన

అవుకు: స్థానిక ఆదర్శ, కేజీబీవీ విద్యార్థినులకు బుధవారం సచివాలయ మహిళా పోలీసులు విజయలక్ష్మి, సునీత స్వేచ్ఛా సంకల్పలో భాగంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. డ్రెస్సింగ్ సెన్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తేడాలు, చెడు వ్యసనాల దుష్పరిణామాలు, సోషల్ మీడియా ప్రభావం తదితర విషయాలను వివరించారు.

చేనేతకు.. జగనన్న చేయూత!

- వైఎస్సార్ నేతన్న నేస్తంతో ఆర్థిక సాయం
- ఏటా రూ.24 వేలు అందిస్తున్న జగన్ సర్కార్
- 21న ఐదో విడత సొమ్ము విడుదలకు చర్యలు



పట్టుచీరెను నేస్తున్న చేనేత కార్మికురాలు (ఫైల్)

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేతి వృత్తులకు అండగా నిలుస్తుంది. గత పాలకుల నిర్లక్ష్యంతో దీనావస్థకు చేరిన చేనేత రంగానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఊపిరి పోశాడు. సొంత మగ్గం ఏర్పాటు చేసుకొని స్వయంగా చేనేత వస్త్రాలు నేసే ప్రతి కార్మికుడికి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో చేనేతలకు అండగా నిలబడి చేనేత రుణ బకాయిలను మాఫీ చేశారు. నూలు, రంగు, రసాయనాలపై 10 శాతం సబ్సిడీని ప్రకటించి చేనేత పరిశ్రమను ఆదుకున్నారు. తండ్రి అడుగు జాడల్లోనే సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే చేనేత కార్మికుల కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టారు. మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికి సంవత్సరానికి రూ.24 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతలు జమ అయిపోంది. ఈనెల 21న తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఐదో విడత పంపిణీ చేయనున్నారు.ఈ మేరకు అధికారయంత్రాం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఒక్కో నేతన్న కుటుంబానికి ఐదు విడతల్లో రూ.1.20 లక్షల మేర లబ్ధి చేకూరనుంది.

నేతన్న నేస్తంతో వెలుగులు

వృత్తినే నమ్ముకున్న నేతన్న గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన నేతన్న నేస్తం పథకం ద్వారా వెలుగులు వచ్చాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈపథకం కింద ఐదో విడతలో 495 మంది నేతన్నలకు లబ్ధి జరుగుతుంది.

నియోజకవర్గంలో నేతన్న నేస్తం లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు
కొలిమిగుండ్ల	76
బనగానపల్లె	113
అవుకు	130
కోవెలకుంట్ల	73
సంజామల	103

వ్యవసాయం తర్వాత రెండో అతి పెద్దరంగం చేనేత. దీంతో చేనత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతంలో సహకారం రంగం(సొసైటీ)లో సభ్యులుగా ఉన్న వాళ్లకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వచ్చేవి. ఇప్పుడు అలా కాకుండా మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికీ ఆర్థిక సాయం అందుతుంది. పెట్టుబడులు దక్కక అప్పులు పాలైన నేతన్నల కుటుంబాల దుర్భర పరిస్థితులను ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో కళ్లారా చూసి చలించిపోయారు వైఎస్ జగన్. అధికారంలోకి రాగానే నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యనిస్తూ చేనేతల జీవితాల్లో వెలుగులు నింపారు. వైస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు చేనేతలు.

జగన్ సాయం తీర్చుకోలేం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలకు చేస్తున్న సాయం తీర్చుకోలేనిది. ప్రతి ఏటా ఆర్థిక సహకా రం అందజేస్తూ అదుకుంటున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా మగ్గం ఉన్న ప్రతి ఒక్క కార్మికుడికి ఏటా రూ.24 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ పథకం చాలా కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంది. ప్రభుత్వ సాయం మరువం.

– నాగరాజు, కోటపాడు

ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కాం



నేతన్న నేస్తం పథకం ద్వారా ఆర్థిక ఇబ్బందుల నుంచి కొంతమేర గట్టెక్కాం. ఎప్పుడైనా మగ్గం, మోటార్ మరమ్మతులకు గురైతే చాలా ఇబ్బంది పడేవారం. ప్రభుత్వం ఇచ్చే రూ.24 చాలా ఉపయోగపడుతుంది. ఈ పథకంతో చాలా మంది చేనేతల జీవితాల్లో మార్పులు వచ్చాయి. జగనన్న మమ్మల్ని ముందుండి నడిపిస్తున్నారు. ఈమేలును ఎప్పటికీ మర్చిపోం.

– సుబ్బరాయుడు,కోటపాడు

నేడు జగనన్న సురక్ష

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధిక తెలిపారు. అర్హతలు ఉండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తించని కుటుంబాలకు పథకాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమానికి ఏపీఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు.

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు సచివాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. అర్హత ఉండి ఇంకా ప్రభుత్వ పథకాలు అందని పేదలను గుర్తించడంతోపాటు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులో మార్పులు తదితర 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందజేస్తామని, ప్రజలు సద్వినియెగం చేసుకోవా లని సూచించారు.

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని గ్రామ సచివాలయం-2 పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని చెప్పారు. లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల, మంగంపేట గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఇంచార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి అక్కడికక్కడే పరిశీలించి ధ్రువీకరణపత్రాలు అందజేస్తామన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని 5, 6 సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి బుధవారం తెలిపారు. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

‘వైఎస్సార్ జలకళ’ రైతులకు వరం



రైతులు వ్యవసాయ పరికరాలు తీసుకెళ్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లెరూరల్: ‘వైఎస్సార్ జలకళ’ పథకం రైతులకు వరం అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ పథకం కింద 32 మంది రైతులకు మంజూరైన విద్యుత్ మోటార్, పైపులు, మీటర్ బోర్డులను ఎమ్మెల్యే అందజేశారు. వ్యవసాయ పరికరాలను ఆయా గ్రామాల రైతులు తీసుకెళ్తున్న వాహనాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన ఏర్పాటు కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుపక్షపాతి అని, అన్నదాతల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీవిద్య,ఏపీఎం హరికృష్ణ, షేక్ ముస్లిం కార్పోరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, పసుపల గ్రామ సర్పంచ్ మోహన్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాపన్న, చిన్నప్పరెడ్డి, ఈశ్వర్‌నాయక్ టీఏలు,ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె మండలానికి ప్రథమ స్థానం

బనగానపల్లె: మండలంలో ఈ నెల 1 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలోనే బనగానపల్లె మండలానికి ప్రథమ స్థానం లభించిందని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. గురవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో పతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అర్హులైనవారికి 12,307 ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఇల్లూరుకొత్తపేట సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించి జగనన్న సురక్ష కార్యక్రమంలో 2,100 ధ్రువీకరణ పత్రాలను అందజేయడంతో ప్రథమస్థానం సాధించిందని ఎంపీడీఓ వివరించారు.

ఓటర్ల జాబితా రూపొందించేందుకు సహకరించాలి

- ఆర్డీఓ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట్‌రెడ్డి

డోన్: ఓటర్ల జాబితాలో తప్పు, ఒప్పులను ఎత్తిచూపి అన్ని రాజకీయ పార్టీలు నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం నిర్వహించిన రాజకీయ పార్టీ నాయకుల సమావేశానికి తహసీల్దార్ విద్యాసాగర్, బేతంచర్ల తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎన్నికల సంఘం డిప్యూటీ డీటీ మధు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ఓటర్ల తుది జాబితాను ప్రచురించేందుకు సమయం ఉన్నందున ఏవైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితాను రూపుదిద్దేందుకు ప్రతిఒక్క రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం అధికారులకు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సూచనలను పరిశీలిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. సమావేశంలో సీపీఐ నాయకులు సుంకయ్య, పులిశేఖర్, సీపీఎం నాయకులు నాగరాజు, బీజేపీ నాయకులు రమణ, వడ్డె మహరాజ్, హేమసుందర్ రెడ్డి, కిరణ్, టీడీపీ నాయకులు రామక్రిష్ణ, శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట శ్రీను పాల్గొన్నారు.

ప్రారంభమైన మొహర్రం



ఫాతెహాల్ సమర్పిస్తున్న నవాబు వంశీయులు

బనగానపల్లె రూరల్:నెలవంక బుధవారం సాయంత్రం కనించడంతో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి.రాత్రి స్థానిక ఆస్థానంలోని శ్రీ హజరత్ అబ్బాస్ పీర్లను బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజల్ అలి ఖాన్ ఆధ్వర్యంలో పీర్లను ఇంటి నుంచి భక్తి గీతాలు అలపిస్తూ ఆస్థానం వద్దకు తీసుకొచ్చారు. పీర్లను అందంగా ముస్తాబు చేసి, పూలదట్టిలు సమర్పించారు.26వ తేదీన చిన్న సరిగెత్తు, 27న మధ్య సరిగెత్తు,29జుర్రేరువాగులో పీర్లనిమజ్జనంతో మొహ ర్రంవేడుకలుముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

బాధితులకు అండగా నిలుస్తే కేసులా

డోన్ టౌన్ :మోసపోయిన వారికి అండగా నిలిసి నిరసనలు చేపట్టిన ప్రజా సంఘాల నా యకులపై పోలీసులు కేసులు బనాయించడం సరికాదని సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు పులిశేఖర్, నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో మోసం చేసిన బీజేపీ నాయకుడు ఆర్మీ రామయ్యను అరెస్టు చేయాలని ప్రజా సంఘం నాయకులుగా రాస్తరోకో నిర్వహిస్తే కేసులు పెట్టి నిందితులకు వత్తాసు పలకడం అన్యాయమని ఖండించారు.

టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వేములపాడుకు చెందిన నాయకులతో ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: నియోజకవర్గంలోని అవుకు మండలం వేములపాడు గ్రామానికి చెందిన 13 టీడీపీ కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని పార్టీ కండువకప్పి సాదరంగా ఆహ్వానించారు. వేములపాడు గ్రామం టీడీపీకి చెందిన కె.మధనగోపాల్, తెలుగుగోవర్ధన్, తెలుగు సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, ఎస్ సంటెన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, బాలహుస్సేని, నాగమద్దిలేటి, పెద్ద వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు బాలనాగన్న, సుబ్రహ్మణ్యం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న తీరుపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు గ్రామాల నుంచి వలసల పరంపర కొనసాగుతుందన్నారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పాటుపడాలని, నాయకులు, కార్యకర్తలకు అండా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సిందుకురి సురేష్‌కుమార్,సుబ్రహ్మణ్యం,వైఎస్సార్‌సీపీ నాయకులు సిందుకురిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వా బాగున్నావా... పింఛన్ అందుతుందా!

- వేములపాడులో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని
- చిరుజల్లు కురుస్తున్నా కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మండల పరిధిలోని వేములపాడులో విస్తృతంగా పర్యటించారు. చిరుజల్లులను కురుస్తున్నా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అవ్వా..బాగున్నావా... ఇంటి వద్దనే పింఛన్ అందుతుందా... అని ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. ప్రతిఒక్కరిని పలుకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు స్థానికులు విన్నవించగా తప్పకుండా చేపడుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అన్నవరం నుంచి వేములపాడుకు రహదారి వేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చెన్నంపల్లె నుంచి జంబులదిన్నె వరకు వయా అన్నవరం, వేములపాడు మీదుగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ సర్కార్ కోట్ల రూపాయలను వెచ్చించి ప్రతిపల్లెకు బీటీ, సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను చేపట్టిందని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ అబ్దుల్ హక్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో ఏఈలు కరిముల్లా, పక్కీరయ్య, ఈఓ అశ్విన్ కుమార్, ఏపీఓ అనీఫా, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిందుకూరి సురేష్, నాయకులు చిందుకూరి సుబ్రహ్మణ్యం, గోపాల్, చంద్రశేఖర్, నాగేంద్ర ప్రసాద్, రమేష్, మదన గోపాల్, గోవర్ధన్, సుబ్బరాయుడు, పోలూరు కృష్ణ, తలారి పెద్ద పాపన్న, మిద్దె ఓబులేసు, దండు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే



ప్రహరీకి తుదిమెరుగులు దిద్దుతున్న దృశ్యం

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో రూ.76లక్షలతో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యా యి. రూ.36లక్షలతో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, రూ.40 లక్షలతో పాఠశాల ప్రహా రీ పనులు పూర్తయ్యాయి. ఈ మేరకు పూర్తయిన అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న కంబగిరిస్వామి తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేత

డోన్ టౌన్ : పట్టణంలోని నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన దివంగత కొత్తూరు నారాయణ భార్యకు ఆవోపా నాయకులు బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఆర్యవైశ్య సంఘీయులు పద్మావతి, ఈశ్వరయ్య కుమారుడు గోపికృష్ణ ఆర్థిక సాయంతో ఆమెకు నిత్యావసర సరుకులు అందజేశామని ఆవోపా కార్యదర్శి జోన్నలగడ్డ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా సభ్యులు మద్దయ్యశెట్టి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

25న జాబ్ మేళా

బేతంచెర్ల: ఏపీ స్కిల్ డెవలెమ్‌మెంట్ ఆధ్వర్యంలో 3 కంపెనీలలో పనిచేయుటకు 18నుంచి 30 సంవత్సరాలలోపు నిరుద్యోగ, యువతి, యువకులకు పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట అధికారి ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోవెలకుంట్ల: అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని పెన్నా నది నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను బుధవారం కోవెలకుంట్ల సెబ్ అధికారులు సీజ్ చేశారు. ఎలాంటి రికార్డులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సెబ్ అధికారులు దాడి చేశారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

ఆశల వర్షం !



పచ్చగా కళకళలాడుతున్న మొక్కజొన్న

కోవెలకుంట్ల: రెండు రోజుల నుంచి దోబూచులాడుతున్న వరణుడు ఎట్టకేలకు కరుణించాడు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. పైరు మొలకెత్తి నెల రోజులు కావస్తుండగా ఇప్పటి వరకు సరైన వర్షం పడలేదు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలు ఆయా పంటలకు అనుకూలంగా మారడంతో రైతులకు ఊరటనిచ్చాయి. సాగుచేసిన పైర్లకే కాకుండా విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్న పొలాలకు వర్షం ఆశాజనకంగా మారడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులపాటు వర్షం కురిసే అస్కారం ఉండటంతో ఈ ఏడాది ఖరీఫ్ అన్ని విధాలా కలిసి వస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

తప్పిపోయిన బాలుడి అప్పగింత

డోన్ టౌన్ : సొంతూరు నుంచి తప్పిపోయి డోన్ రైల్వే స్టేషన్లో మంగళవారం అర్ధరాత్రి మైసూర్ సూపర్ ఫాస్ట్ రైలు ఎక్కుతున్న బాలుడిని గుర్తించిన రైల్వే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పాణ్యం గ్రామానికి చెందిన ఉరుకుందప్ప కుమారుడు వీరరాఘవ(11) డోన్‌ల్లో రైలు ఎక్కుతుండగా అనుమానం వచ్చిన రైల్వే కానిస్టేబుల్ తాహెర్‌బాషా బాలుడిని నిలువరించి వివరాలు సేకరించారు. తల్లిదండ్రులకు, బంధువులకు సమాచారం అందజేయగా వారు డోన్ రావడంతో బాలుడిని అప్పగించారు.

ఇద్దరిపై కేసు నమోదు

అవుకు: ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసామని అవుకు ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. కాశిపురం గ్రామానికి చెందిన నగరూరి విజయ్‌కి ఇరవైఏళ్ల కిందట ఓబులమ్మతో వివాహమైంది. అయితే భార్యకు విడాకులు ఇవ్వకుండా నంద్యాల పట్టణానికి చెందిన రాజేశ్వరిని రెండవ వివాహం చేసుకుని తనను వేధిస్తున్నారని ఓబులమ్మ బనగానపల్లె కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఎండార్స్‌మెంట్ మేరకు విజయ్, రాజేశ్వరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బనగానపల్లెరూరల్: నందివర్గం గ్రామానికి చెందిన పుల్లయ్యతోపాటు అతని భార్య లైసమ్మలపై దాడి, బెదిరింపుల కేసు నమోదు చేసినట్లు నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. చెన్నమ్మకు సైమన్, పుల్లయ్య కుమారులు. 2.30 ఎకరాలు పెద్దకుమారుడు సైమన్‌కు, 4.50 ఎకరాలు చిన్నకుమారుడు పుల్లయ్యకు దాన విక్రయం చేసింది. అయితే సైమన్ పొలంలోకి పుల్లయ్య అతని భార్య దౌర్జన్యంగా వెళ్లి సాగు చేపట్టారు. ఏమిటీ దౌర్జన్యం అని ప్రశ్నించిన సైమన్ అతని భార్య చెన్నమ్మపై పుల్లయ్య దంపతులు దాడికి పాల్పడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన గూటాల యూసుఫ్ గతేడాది డిసెంబర్ 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయా ప్రాంతాలు, బంధువుల దగ్గర ఆచూకి కోసం గాలించినా తెలియలేదు. దీంతో భార్య షాక్రున్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ బుధవారం తెలిపారు.

వేధింపులు కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన జక్కపోగుల భారతిని నంద్యాల మండలం అయ్యలూరుకు చెందిన మేకల పవన్ కళ్యాణ్‌తో ఈ ఏడాది జనవరిలో వివాహం చేశారు.కొంతకాలంగా భర్త పవన్ కళ్యాణ్, అత్త ఆదీశ్వరమ్మ సంసారం విషయంలో భారతిని వేధింపులకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య బుధవారం తెలిపారు.

కేసు నమోదు

డోన్ టౌన్ : రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితులపై పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. తన కుమారుడికి రైల్వేలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.16 లక్షలు తీసుకొని మోసం చేశారని వెంకటనాయునిపల్లెకు చెందిన వట్టివెళ్ల బలరామయ్య ఫిర్యాదు మేరకు బీజేపీకి చెందిన ఆర్మీ రామయ్య, వడ్డే అమర్‌నాథ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బనగానపల్లెరూరల్: మండల పరిధిలోని రాళ్ల కొత్తూరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగలచ్చమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు నాగలచ్చమ్మ ఆర్‌అండ్‌బీ రోడ్డు దాటుతుండగా ఓ ప్రైవేట్‌బస్సు ఢీ కొట్టిందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

సంజామల: మండల పరిధిలోని లింగందిన్నె గ్రామ సచివాలయల ఉద్యోగిపై బుధవారం దాడి జరిగింది. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు కాలింగరి మహేష్ లింగందిన్నె సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మద్దిరాల శేఖర్ తన భార్య శ్రావని పేరు రేషన్ కార్డులో యాడ్ చేయాలని అడుగ్గా డిజిటల్ అసిస్టెంట్ రికార్డులను పరిశీలించి మ్యారెజ్ సమయంలో వయసు తక్కువ ఉన్నందున చేయలేమన్నారు. దీంతో పక్కనే ఉన్న కుర్చీతో శేఖర్ తనపై దాడి చేశాడని డిజిటల్ అసిస్టెంట్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యప్తు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.